# 74. దేవుడి చిరునామా

కాశీ వెళ్ళే ఓ రైల్లో తమ ఎదురు ప్రయాణీకుడైన ఓ సన్న్యాసి భగవద్గీతని చదువుకోవడం చూసాడో నాస్తికుడు.

''స్వామి! నిజంగా దేవుడున్నాడంటారా?'' కాలక్షేపానికి ప్రశ్నించాడతను.

సాధువు తలెత్తి అతనివంక చూసి, ఉన్నాడన్నట్లుగా మౌనంగా తలవూపి మళ్ళీ గీతని చదువుకోసాగాడు.

"దేవుణ్ని చూడాలని నాకు బాగా కుతూహలంగా ఉంది. దయచేసి ఆయన చిరునామా చెప్తారా?" పరిహాసంగా అడిగాడు అతను.

అది గుర్తించి, పుస్తకం మూసి ఆ సన్యాసి చెప్పాడు.

"నీకో కథ చెప్తా విను. అది నీ ప్రశ్నకి జవాబు ఇవ్వచ్చు. పూర్వం ఓ ఊళ్ళో ఓ అమ్మాయికి ఆమె తల్లి తండ్రులు తమ పక్కింటి యువకుడితో వివాహం నిర్ణయించాలనుకున్నారు. ఆమె అందుకు ఒప్పుకోలేదు. నేను పెళ్ళంటూ చేసుకుంటే అందరిలోకి గొప్పవాడినే చేసుకుంటాను తప్ప మన పక్కింటిలాంటి వాడిని చేసుకోను" చెప్పిందా పిల్ల.

"ఎవర్ని చేసుకుంటావయితే?" ప్రశ్నించింది తల్లి.

"మన ఊళ్ళో అందరి కన్నా గొప్పవాళ్ళెవరు?" అడిగిందా అమ్మాయి.

"మన ఊళ్ళో ఏం ఖర్మ? మన దేశంలోని అందరికంటె గొప్పవాడు రాజుగారు." చెప్పాడు తండ్రి.

"అయితే ఇంకేం? ఆయన్నే చేసుకుంటాను." చెప్పిందా పిల్ల.

అది కుదరదని ఎంత చెప్పినా వినలేదా అమ్మాయి.

తండ్రికి ఏం చెయ్యాలో తెలీక 'సరే' అన్నాడు.

ఆ పిల్ల రాజధానికి చేరుకుంది. ఓ పల్లకీలో ఊరేగుతూ ఆ రాజుగారు ఆమెకి ఎదురు పడ్డాడు. 'నన్ను పెళ్ళి చేసుకో' అని ఆమె అడగబోతూండగా,

ఆ రాజు పల్లకి దిగి కాలినడకన వెళ్ళే ఓ సన్న్యాసి పాదాలకి సాష్టాంగ నమస్కారం చేయడం చూసింది. 'ఈ సన్న్యాసి రాజుకంటే గొప్పవాడు కాకపోతే ఎందుకతనికి నమస్కరిస్తాడు?' అని ఆలోచించి ఆమె ఆ సన్న్యాసినే వివాహం చేసుకోవాలనుకుంది.

అతని దగ్గరకి వెళ్ళి ఆ విషయం అడగబోతూండగా అతను రోడ్డు పక్కన ఉన్న ఓ వినాయకుడి గుడి ముందు నిలబడి మూడు గుంజీలు తీయడం చూసింది. 'ఈ సన్న్యాసి కన్నా ఆ వినాయకుడే గొప్ప. చేసుకుంటే వాణ్ణే చేసుకోవాలి' అనుకుని ఆ అమ్మాయి లోపలికి వెళ్ళింది. ఇంతలో ఓ కుక్క వచ్చి ఆ విగ్రహం ముందు కాలెత్తి దాన్ని అపవిత్రం చేసింది. అప్పుడామె ఆ వినాయకుడికన్నా ఆ కుక్కే శ్రేష్టం అయి వుంటుందని భావించి దాన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటూండగా, ఓ పిల్లవాడు ఆ కుక్కని రాయితో కొట్టాడు. అది కుయ్యోమంటూ పరిగెత్తింది.

ఇది చూసిన ఆ అమ్మాయి ఆ పిల్లవాడు గొప్పవాడనుకుని వాణ్ణే పెళ్ళి చేసుకోవాలనుకుంది. కాని ఇంతలో ఓ యువకుడు వచ్చి ఆ పిల్లవాడి చెవిని నులిమి వాణ్ణి మందలించాడు. దాంతో తను చూసిన అందరి కన్నా ఆ యువకుడే గొప్పవాడనుకుని వాడి దగ్గరకి వెళ్ళి తనని వివాహం చేసుకోమని అడిగింది. ఆ యువకుడెవరో కాదు. ఆమె తల్లితండ్రులు కుదిర్చిన సంబంధమే."

కథ పూర్తయ్యాక ఆ సన్న్యాసి చిన్నగా నవ్వుతూ తన ఎదుటి ప్రయాణీకుడితో చెప్పాడు.

"మన హృదయం ఆ అమ్మాయి ఉన్న గ్రామం లాంటిది. దేవుడి కోసం ఎక్కడెక్కడో వెతికినా చివరికి మన హృదయాంతరాల్లోనే దేవుడు ఉన్నాడు అని తెలుస్తుంది. అక్కడ తప్ప ఇంకెక్కడ వెదికినా దేవుడు దొరకడు. అదే దేవుడి నిజమైన చిరునామా."